క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి

బలిజిపేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని నూకలవాడలో వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి శనివారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందించారు. గ్రామంలో 65మందికి, కేంద్రం వద్దకు రాలేని వారికి ఇంటికి వెళ్లి వైద్య సేవలను అందించారు. ఆరోగ్యరీత్యా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ పవిత్ర, ఏఎన్‌ఎంలు, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలి



సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

సీతానగరం: గ్రామాల్లో నిరంతరం సేవలందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ, సీపీఎం మండల కమిటీల ఆధ్వర్యంలో శనివారం స్థానిక రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు పంచాయతీ పాలకులు దీర్ఘకాలంగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న 13 నెలల జీతాలు చెల్లించే వరకు ఆందోళన చేస్తామని అన్నారు. ఆందోళనలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న రాము

పార్వతీపురం: స్థల వివాదంలో ఒకరికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. శనివారం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామానికి చెందిన మండంగి రాము తన ఇంటి వెనుకవున్న ప్రభుత్వ స్థలంలో పూల మొక్కలు తదితరవి పెంచుకుంటున్నాడు. అదే స్థలంలో గ్రామానికి చెందిన కెంగువ సూర్యనారాయణ పశువులు కట్టేందుకు కర్రలు పాతడానికి వచ్చాడు. నా పెరటి స్థలంలో పశువులు కట్టేందుకు కర్రలు ఎందుకు పాతుతున్నావని రాము ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ ఘటనలో సూర్యనారాయణ కర్రతో రాము తలపై కొట్టి గాయపరిచాడు. ఈ మేరకు గాయాలపాలైన రాము అర్ధరాత్రి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోలుగుడ్డిలో విత్తనాల పండగ



ఆకట్టుకున్న విత్తనాల ప్రదర్శన

సీతంపేట: వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ష్ సంస్థ ఆధ్వర్యంలో రోలుగుడ్డిలో శనివారం విత్తనాల పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ష్ డైరెక్టర్ నూక సన్యాసిరావు మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. అటవీహక్కు చట్టం అమలు, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. విత్తనాల పండగ ద్వారా ఆదివాసీ సాంప్రదాయల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త నీలవేణి, హెచ్‌ఓ జయశ్రీ, సమన్వయకర్త బి.శంకరరావు, రవీంద్రనాథ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గరుగుబిల్లి: రైతులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.బి.ప్రసన్నకుమార్ అన్నారు. మండల పరిధిలో ఉద్యాన కళాశాల విద్యార్థులు దత్తత తీసుకున్న సంతోషపురం, సుంకి గ్రామాల్లో శనివారం రైతు దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంటల సాగు, మద్దతుధర, మార్కెటింగ్ సౌకర్యాలపై రైతులకు అవగాహన కల్పించారు. సాగు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.రాంబాబు, కె.రవీంద్ర, మాజీ సర్పంచ్ ఎ.గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కుటుంబ పాలనలో...
రైతే రారాజు

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- వాడవాడలా రాజశేఖరరెడ్డి జయంతి



సాలూరు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, ప్రజాప్రతినిధులు, నాయకులు



సాలూరు: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులు రాజులయ్యారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. వైఎస్సార్ 74వ జయంతి వేడుకల్లో భాగంగా పట్టణంలోని వైఎస్సార్ కూడలి వద్ద గల వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయం దండగ అన్నారని.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన రాజశేఖరరెడ్డి వ్యవసాయాన్ని పండగలా మార్చారని చెప్పారు. జలయజ్ఞం, రుపాయికే కిలో బియ్యం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, తదితర పథకాలతో రాజన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో వ్యవసాయానికి పెద్దపీట వేశారని తెలిపారు. నవరత్నాలతో ప్రజలందరినీ ఈ ప్రభుత్వం ఆదుకుంటున్నదని వివరించారు. రైతుల కోసం రైతుభరోసా కేంద్రాలు, రైతు భరోసా, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, పంటల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని



సీతానగరం: దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.జయమణి

చెప్పారు. జలయజ్ఞంలో భాగంగా రాష్ట్రంలో తొలిసారిగా పాచిపెంట మండల కేంద్రంలో పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను దివంగత నేత వైఎస్సార్ ప్రారంభించగా.. నేడు ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి పాలనలో జపాన్ నిధులతో ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు జరగుతున్నాయని తెలిపారు. రైతులకు ఉచితంగా విద్యుత్ అందించి రాజశేఖరరెడ్డి ముందడుగు వేయగా.. ఆయన తనయుడుగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు మరింత అండగా నిలుస్తూ ఉచిత విద్యుత్, రైతుభరోసా, ఆర్‌బీకేల ఏర్పాటు, తదతర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం సుమారు 150 మంది పేదలకు దుస్తులు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గిరి రఘు, జర్జాపు సూరిబాబు, రెడ్డి సురేష్, దండి శ్రీనివాసరావు, పాచిపెంట వీరంనాయుడు, డోల బాబ్జి, సలాది అప్పలనాయుడు, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ..



మక్కువ: దివంగత నేత రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మక్కువ: మండల కేంద్రంలోని పద్మశ్రీ. థియేటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత నేత రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహానేతను మరువం

పార్వతీపురం టౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని ప్రజలు మరువలేరని, ఆయన ప్రజలకు చేసిన సేవలు వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచేలా చేశాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. దివంగత వైఎస్సార్ జయంతి సందర్భంగా మండలంలోని నర్సిపురం గ్రామంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వైఎస్సార్



పార్వతీపురం టౌన్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



బలిజిపేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



బలిజిపేట: చిలకలపల్లి జీఎంఎల్ఎఫ్‌లో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ స్ఫూర్తితో తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా రంజక పాలన సాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి

బలిజిపేట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామాలలో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన బలిజిపేటలో చెరువుగట్టుపై ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిలకలపల్లి జీఎంఎల్ఎఫ్‌లో రోగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘులత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళి, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వాడవాడలా..

సీతానగరం: మహానేత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మండలంలోని శనివారం వాడవాడలా వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెదంకలాంలో మహానేత విగ్రహానికి ఎంపీపీ బి.రవణమ్మ, మండల కేంద్రంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ ఎంపీటీసీలు, మండల పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళలర్పించారు. మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి తన అనుచరులతో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణారాయపురం, బూర్జ, లచ్చయ్యపేట తదితర గ్రామాల్లో మహనీయుని విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో..

సాలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మామిడిపల్లిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సువ్వాడ శశికళ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ప్రజాప్రతినిధులు, నాయకులు దండి శ్రీనివాసరావు, భరత్ శ్రీనివాస్, మువ్వల ఆదయ్య, గొర్లె రాజారావు, పెద్దింటి మాధవ, సాంబమూర్తి, సుబ్బారావు, బీసు, తదితరులు.. బాగువలసలో జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, తదితరులు.. శివరాంపురంలో సర్పంచ్ జర్జాపు మోహన్, తదితరులు వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



సాలూరు: మామిడిపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



సీతానగరం: పెదంకలాంలో రాజన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ రవణమ్మ

అన్నదాతకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కానుక

- ఎమ్మెల్యే జోగారావు



అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: అగ్రి టెస్టింగ్ ల్యాబ్ రూపంలో అన్నదాతకు గొప్ప కానుకను రాష్ట్ర ప్రభుత్వం అందజేసిందని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత పుట్టిన రోజును పురస్కరించుకొని నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ రైతు దినోత్సవం ఎంతో ఘనంగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. రైతు దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా రెండవ దశలో నిర్మించిన 52 అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కళ్యాణదుర్గంలో వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. పార్వతీపురం నియోజకవర్గం కేంద్రంలో 68.4లక్షల రూపాయలతో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించామన్నారు. నాడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పాలనలో వ్యవసాయం దండగ అన్న పరిస్థితి నుంచి నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం పండగ అన్న స్థితికి తీసుకువచ్చిన ఘనత ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌కి, తండ్రి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ మరడాన భాగ్యశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ ఎంపీపీ మజ్జి శోభారాణి, పార్వతీపురం పురపాలక సంఘం వైస్ చైర్మన్ యిందుపూరు గున్నేశ్వరరావు, వ్యవసాయ శాఖాధికారులు అగ్రికల్చర్ ఏడీ, మూడు మండలాల ఏఓలు, వీఏఓలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, పార్వతీపురం పురపాలక సంఘం, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం:మండలంలోని వంగర పంచాయ తీ డోలుకోన గ్రామానికి (కీసర మెయిన్ రోడ్డు నుంచి) ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు డోలుకోన గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. తమ గ్రామానికి రోడ్డు నిర్మించ డం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వంగ ర సర్పంచ్ పత్తిక జ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పత్తిక తిరుపతిరావు, పసుపురెడ్డి మహేష్, నిమ్మక కృష్ణారావు, భద్రగిరి టీడబ్ల్యూ డీఈ సింహాచలం, ఏఈ అప్పారావు పాల్గొన్నారు.

అర్హులకు పథకాలు అందించేందుకే..

గరుగుబిల్లి: అర్హులకు సంక్షేమ ఫలాలను అందించాలనే ఉద్దేశంతో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. మండలంలోని మరుపెంట గ్రామంలో శనివారం నిర్వహించి న జగనన్న సురక్ష సర్వేలో ఆయన పాల్గొన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అందలేదనే మాట ఏ ఒక్కరి నుంచి వినిపించకూడద నే ఉద్దేశంతో ప్రతీ గడపకు వెళ్లి పథకాలకు అర్హులైన వారిని గుర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రభు త్వం అందించే వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీ ర్లు పాల్గొన్నారు.

తోటపల్లిలో ప్రత్యేక పూజలు



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేయడంతో పాటు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు.

వంగరలో ఉచిత వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మండలంలోని వంగర గ్రామంలో రాఫ ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్యశిబిరాన్ని శనివారం నిర్వహించారు. మధుశ్రీ హెల్త్ కేర్ వైద్యుడు రవికుమార్ సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు తదితరులు సందర్శించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య, తదితరులను అభినందించారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనశుద్ధి చేయ డం ద్వారా తెగుళ్ల బారినుంచి పంటలను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం అసోసియేట్ జి.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని తాడికొండ గ్రామంలో విత్తనశుద్ధి, బీజామృతం తయారీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విత్తనశుద్ధి చేయడం వలన మొలక శాతం పెరగడంతో పాటు హానిచేసే సూక్ష్మజీవుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. ఫలితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగానికి చేసే ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. వరి, చిరుధాన్యాలు, అపరాలు, నూనెగింజలు మొదలగు పంటలకు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించా రు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఎం.ప్రభావతి, మాజీ సర్పంచ్ అడ్డాకుల గంగరాజు, మండల కోఆర్డినేటర్ పరశురాం తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరను కోరిన గిరిజన సంఘాల నాయకులు



ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సాలూరు:

ఐటీడీఏ పరిధిలోని సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొరను పట్టణంలో ఆయన స్వగృహంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలో గతంలో పనిచేసిన ఆరోగ్య సిబ్బందిని మరలా విధుల్లోకి తీసుకోవాలని.. ఖాళీగా ఉన్న సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేయాలని.. గతంలో పనిచేసిన భాషా విద్యా వలంటీర్లను విధుల్లో తీసుకోవాలని.. ఐటీడీఏలో పనిచేస్తున్న దినసరి వేతనదారుల ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని.. గిరిజన మ్యూజియాలను ఏర్పాటుచేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో పలు గిరిజన సంఘాల నాయకులు దుక్క సీతారాం, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, సంగంరెడ్డి జయసింహ, కోలక గౌరమ్మ, రవణ, గౌరీపతి, సీతారాం, బంగార్రాజు, శంకరరావు, బాబూరావు తదితరులున్నారు.